నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 24 మార్చి 2024 | ADILABAD

## ముక్రా(కే)కు అవార్డు

**భారత ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మాజీ సర్పంచ్**

ఇచ్చోడ, మార్చి 23 : ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)ను ఎన్‌డీటీవీ ఇండియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించింది. లక్ష మొక్కలు నాటి బతికించి నందుకు, చెత్త నుంచి రూ.8 లక్షల ఆదాయం సృష్టించినందుకు అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును భారత ఉప రాష్ట్రపతి జగదీష్ దినకర్ చేతుల మీదుగా శనివారం మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి అందుకున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చూపిన మార్గదర్శకంలో నడుస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.



ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ముక్రా(కే) మాజీ సర్పంచ్ మీనాక్షి


చీక్‌మూన్ వాగులో చెలిమ తీసి నీటిని బిందెల్లో నింపుకుంటున్న గిరిజనులు

కాంగ్రెస్ తెచ్చిన కరువు

# పంట నష్టం.. రైతన్నకు కష్టం..

- 2,477 ఎకరాల్లో దెబ్బ తిన్న పంటలు
- అకాల వర్షంతో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలపై ప్రభావం
- నష్టాన్ని అంచనా వేసిన వ్యవసాయ శాఖ అధికారులు
- కాంగ్రెస్ సర్కారు ఇచ్చే రూ.15 వేల పరిహారంపై ఆశలు

మంచిర్యాల, మార్చి 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవల కురిసిన అకాల వర్షం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జొన్న, మొక్కజొన్న, పొగాకు, కంది, నువ్వులు, మిరప, వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు, ఈదురుగాలులకు చాలా ప్రాంతాల్లో పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చే దశలో ఉన్న జొన్న, మొక్కజొన్న కండ్ల ముందే నేలమట్టమయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నేలకొరగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో తీవ్రమైన నష్టం వాటిల్లింది. నాలుగైదు రోజులపాటు కురిసిన వర్షాలతో ఈ రెండు జిల్లాల్లో దాదాపు 2,477 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు.

**జిల్లాలవారీగా దెబ్బ తిన్న పంట, నష్టపోయిన రైతుల వివరాలు..**

| జిల్లా | దెబ్బ తిన్న పంట(ఎకరాలు) | నష్టపోయిన రైతుల సంఖ్య |
|---|---|---|
| ఆదిలాబాద్ | 2,033 | 1,117 |
| మంచిర్యాల | 444.2 | 383 |

### జొన్న రైతులకు నష్టం

ఆదిలాబాద్ జిల్లాలో జొన్న 1,526 ఎకరాలు, మొక్కజొన్న 434, పొగాకు 26, వరి 11, నువ్వులు 36 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సిరికొండ మండలంలో 11, నేరడిగొండలో 4, బజార్‌హత్నూర్‌లో 5, ఇంద్రవెల్లిలో 5, గుడిహత్నూర్‌లో 7, ఆదిలాబాద్ రూరల్‌లో 5, గాదిగూడలో 4, ఇచ్చోడలో 20, ఇంద్రవెల్లిలో 7, జైనథ్‌లో 5, తలమడుగులో 7 మొత్తంగా 80 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

- మంచిర్యాల జిల్లాలో 69 ఎకరాల్లో వరి, 374.2 ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో నువ్వుల పంట దెబ్బతిన్నాయి. దండేపల్లి మండలంలో 13, లక్షెట్టిపేటలో 11, జన్నారంలో 6 ఎకరాల్లో మొత్తం 30 గ్రామాల్లో పంటలు నేలకొరిగాయి. ఉమ్మడి జిల్లాలో 1,900 ఎకరాల్లో జొన్న పంట దెబ్బతినడంతో సాగు చేసిన రైతులకు అరణ్యరోదనే మిగిలింది. మంచిర్యాల జిల్లాలో వరి నేలకొరిగింది.
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ స్వల్పంగా నష్టం వాటిల్లింది. ముఖ్యంగా చేతికొచ్చిన మిరప నాశనమైంది. బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాల్లో ఆరబెట్టిన మిరప అకాల వర్షాలకు నీటమునిగాయి. దీంతో పంట తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎలాగైనా పంట కొనుగోలు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### పరిహారం చెల్లించాలి..

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.15 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించింది. గతంలో ఇదే సమయంలో వచ్చిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు పంట నష్టపోయిన రైతులకు కేసీఆర్ సర్కార్ రూ.10 వేల చొప్పున పరిహారం అందించింది. నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు అప్పుడు సాయం అందింది. కానీ.. ఇప్పుడున్న ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్ధానాల్లో ఏ ఒక్కటి నిలబెట్టుకోలేదు. రైతు భరోసా అందరికీ ఇవ్వలేదు. అధికారం లోకి రాగానే చేస్తామన్న రుణమాఫీ ఊసే ఎత్తడం లేదు. దీంతో పంటలకు నష్టపరిహారం అందించడం ప్రకటనలకే పరిమితం అవుతుందా? లేక నిజంగానే రైతులకు పరిహారం అందజేస్తారా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి.

### ప్రభుత్వమే ఆదుకోవాలి..



నాకు ముంజంపల్లిలో 5.20 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో ఈ యేడాది మిర్చి వేశా. పంట బాగానే వచ్చింది. కానీ.. గత మంగళవారం రాత్రి సమయంలో వడగండ్ల వాన కురియడంతో కోసి ఎండబెట్టిన మిర్చి తడిసి ముద్దయింది. అదేవిధంగా చెట్టుపై ఉన్న మిర్చి కూడా పూర్తిగా రాలి.. నాణ్యత తగ్గింది. కొనుగోలుదారులు ధర పెట్టడం లేదు. తద్వారా నేను పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో నాకు సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల ద్వారా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**- తుమ్మిడె శంకర్, ముంజంపల్లి, మిర్చి రైతు**

### కోలుకోలేని దెబ్బ



ఆరుగాలం కష్టపడి పంట చేతికందే సమయంలో అకాల వర్షం దెబ్బతీసింది. నేను నాకున్న రెండెకరాల్లో మిర్చి వేశా. పెట్టుబడిని పెద్ద మొత్తంలో పెట్టి పంట బాగానే రావడంతో మురిసి పోయా. కానీ.. వడగండ్ల వానతో ఆరబెట్టిన పంట తడిసి రంగు మారి నల్లబడింది. నాణ్యత కోల్పోవడంతో అనుకున్న ధర రాక నిరాశే మిగిలింది. రంగు మారిన మిర్చితో కొనుగోలు చేసే వారు కూడా తక్కువ ధర పెడతామంటున్నారు. నాకు సుమారు రూ.1.5 లక్షల నష్టం వాటిల్లింది. నష్టంపై ప్రభుత్వం సర్వేలు నిర్వహించాలి. పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నా.

**- ఆబీద్ ఖాన్, కుకుడ, మిర్చి రైతు**


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

## కేసు వివరాలను పరిశీలించాలి..

**నెలవారి నేర సమీక్షలో ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, మార్చి 23 : నమోదైన ప్రతి కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పురోగతి సాధించాలన్నారు. ముఖ్యంగా కేసుల దర్యాప్తులో సీసీ టీవీల పరిశీలన, ఫోన్ ఆధారంగా నేరస్తులను పసిగట్టి శిక్షలు పడేవిధంగా దర్యాప్తును కొనసాగించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల నేరస్తులను కోర్టులో హాజరు పర్చి, రెండు నెలల లోపు దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పి.శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, సీఐలు కే.సత్యనారాయణ, ఏ.అశోక్, డి.సాయినాథ్, పి.చంద్రశేఖర్, కే.ఫణిదర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

## కండ్ల ముందే విగతజీవిగా..

- బాలుడి పైనుంచి వెళ్లిన కారు
- అక్కడికక్కడే మృత్యువాత
- మిన్నంటిన రోదనలు


మహర్షి(ఫైల్)

కడెం, మార్చి 23 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన మోతె మహర్షి(4) అనే బాలుడు కారు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. మోతె కవిత-నర్సయ్య దంపతుల కుమారుడు మహర్షి. శనివారం ఉదయం ఏడు గంటలకు ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో సాదుల మహేశ్ కారు నంబర్(టీఎస్16యూడీ 3903)ను రివర్స్ తీస్తూ.. అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి మహర్షిపైకి ఎక్కించాడు. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచానామ అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మహర్షి తల్లి దండ్రులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు ఒక్క అక్క కూడా ఉంది. ఒక్కగానొక్క కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.


చీక్‌మూన్ వాగులో నీటిని నింపుకుని గ్రామానికి వెళ్తున్న గిరిజనులు

# దూప తీర్చేదెవరు?

**అందని మిషన్ భగీరథ నీరు** | **పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం**

- అటవీ శాఖ క్లియరెన్స్ ఇస్తే స్వచ్ఛమైన నీరు
- చెలిమ నీరే తాగుతున్న వస్పత్రి కొత్తగూడెం వాసులు
- కిలోమీటరు దూరం నుంచి ఎడ్లబండ్లలో తీసుకొచ్చుకుంటున్న ప్రజలు
- బోరు అయినా వేయాలని విజ్ఞప్తి

**అది నిర్మల్ జిల్లా పెంబి** మండలంలోని వస్పల్లి కొత్తగూడెం. ఈ మారుమూల గ్రామంలో దాదాపు 50 మంది నివసిస్తున్నారు. మంచినీటి సరఫరా, బోరు లేకపోవడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న చీక్‌మూన్ వాగులోని చెలిమ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మహిళలు కొండలు, కోనలు దాటుకుంటూ బిందెల ద్వారా.. పురుషులు ఎండ్లబండ్లలో డ్రమ్ముల ద్వారా తెచ్చుకుంటున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో ప్రతి గూడెం, తండా, పల్లెకు మిషన్ భగీరథ నీటిని అందించింది. కానీ.. ఈ గ్రామానికి పైపులైన్ వేయడానికి ప్రయత్నించగా.. అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి మూన్నెళ్లు అయినా.. సమస్యను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరో ప్రత్యామ్నాయంగా బోరు వేయించాలని వేడుకుంటున్నారు. **- పెంబి, మార్చి 23**


ఎడ్ల బండిలో డ్రమ్ము పెట్టి వాగులో చెలిమ నుంచి నీళ్లు నింపుకుంటున్న ప్రజలు

### తాగు నీటి గోస తీర్చండి..



మంచి నీరు, ఇతర అవసరాలకు గ్రామంలో చుక్కనీరు లేదు. ఉదయం, సాయంత్రం బిందెలు పట్టుకుని ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న చిక్‌మూన్ వాగుకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నాం. అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో మా గ్రామంలో మిషన్ భగీరథ పైపులు వేయలేదు. తాగునీటికి అవస్థలు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బోరు వేసి నీటి గోస తీర్చాలని కోరుతున్నాం. **- లచ్చుబాయి, వస్పల్లి కొత్తగూడెం.**

## వంతెనను పరిశీలించిన మంత్రి

పెంబి, మార్చి 23 : భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పస్పుల వంతెనను శనివారం పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంతెనను రీ-డిజైన్ చేసి పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పుల్గంపాండ్రి-సిరిచెల్మ రోడ్డు నిర్మించాలని, మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ ఇప్పించాలని ప్రజలు మంత్రిని కోరగా.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు.

### అలేఖ్య కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్, మార్చి 23 : గత నెల 8న ప్రేమోన్మాది శ్రీకాంత్ అతికిరాతకంగా హత్య చేసిన అలేఖ్య కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి సీతక్క భరోసా కల్పించారు. శనివారం అంబేద్కర్‌నగర్‌లోని అలేఖ్య కుటుంబాన్ని పరామర్శించారు. అలేఖ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీకాంత్‌కు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


సమస్యలను మంత్రి సీతక్కకు వివరిస్తున్న ప్రజలు


గుడిహత్నూర్‌లోని ఉర్దూ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## సౌకర్యాలు కల్పించాలి..

- పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలి..
- కలెక్టర్ రాజర్షి షా

గుడిహత్నూర్, మార్చి 23 : పార్లమెంటు ఎన్నికల్లో ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని.. అవసరం ఉన్న చోట ర్యాంపులు, మరమ్మతులు చేపట్టాలని మండల అధికారులకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గుడిహత్నూర్ మండలంలోని గోండ్‌హర్కాపూర్, మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు బాగా లేదని, సక్రమంగా రావడం లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పనితీరుపై విచారణ చేయించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చే వారికి కనిపించేటట్లు డ్యూటీ చేసే సిబ్బంది వివరాలను గోడపై రాయించాలని ఆదేశించారు. స్టాకు రూం, ప్రసూతి గదిని పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.


పట్టణంలో అమ్ముతున్న మోసంబిలు


ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో విక్రయానికి ఉంచిన కూలర్లు


ఎండ వేడికి తట్టుకోలేక రుమాలు చుట్టుకున్న వాహనంపై వెళ్తున్న వ్యక్తి






పట్టణంలో అమ్ముతున్న కొబ్బరి బోండాలు, తర్బూజాలు, దోసకాయలు



# ముదురుతున్న ఎండలు

**ఆదిలాబాద్ జిల్లాలో** ఎండలు ముదురుతున్నాయి. దాదాపు 39 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం రోజుల నుంచి తుఫాన్ ప్రభావంలో అక్కడక్కడ వాన పడింది. శనివారం ఒక్కసారి సూర్య భగవానుడు భగ్గుమనడంతో జనం తట్టుకోలేక పోతున్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు వెళ్తున్నారు. మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. చల్లదనం కోసం శీతల పానీయాలను సేవిస్తున్నారు. కొబ్బరిబోండాలు, తర్బూజా, దోసకాయలు విపరీతంగా అమ్ముడుపోతున్నాయి. కూలర్లు, ఫ్యాను రిపేరు చేసేవారికి కూడా గిరాకీ పెరిగింది. చిన్నారులు, వృద్ధులు మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. **- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, మార్చి 23**